సాక్షి
పెద్దపల్లి
శనివారం, 3, జూన్, 2023



పత్తి క్వింటాల్‌కు రూ.6,561

పెద్దపల్లిరూరల్: జిల్లా మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.6,561 పలికింది. కనిష్టం రూ.6,001, సగటు రూ.6,311గా నిర్ణయించినట్లు ఇన్‌చార్జి అధికారి సతీశ్ తెలిపారు.



కవితను కలిసిన కోలేటి

గోదావరిఖని: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శుక్రవారం సచివాలయంలో పోలీస్ హౌసింగ్‌బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.0/30.0

వాతావరణం వేడిగా ఉంటుంది. తీవ్ర వడ గాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా

అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు

- వ్యవసాయం, విద్య, ప్రజారోగ్య రంగాలకు పెద్దపీట
- తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో చీఫ్ విప్ భానుప్రసాద్‌రావు


ప్రసంగిస్తున్న భానుప్రసాద్‌రావు
జెండా ఆవిష్కరిస్తున్న విప్ భానుప్రసాద్‌రావు


అమరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న విప్ భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ మధు, కలెక్టర్ సంగీత తదితరులు


వేదికపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు

సాక్షి, పెద్దపల్లి: జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని, సమగ్రాభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని శాసనమండలి చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాద్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ముందుగా అమరవీరుల స్మారకస్తూపం వద్ద విప్, ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళి అర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథి భానుప్రసాద్‌రావు జాతీయ జెండా ఆవిష్కరించి, పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలోనే అద్భుత విజయాలు సాధించి అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తూ, దేశానికి రాష్ట్రం ఆదర్శంగా సీఎం కేసీఆర్ నిలిపారని వివరించారు.

30శాతం పెరిగిన సాగు విస్తీర్ణం

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, చెరువుల పునరుద్ధరణ, సకాలంలో ఎరువులు, విత్తనాల పంపిణీ వంటి పథకాలు, సంస్కరణలను సీఎం అమలులోకి తీసుకొచ్చారని వెల్లడించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, లింక్ కెనాల్ ఏర్పాటుతో జిల్లాలో సాగు విస్తీర్ణం గతంలో కంటే 30 శాతం పెరిగిందని తెలిపారు.

ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు

రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేశారన్నారు. స్వయం ఉపాధి కింద జిల్లాలో 5,290 మంది లబ్ధిదారులకు సబ్సిడీపై రూ.49.69కోట్లు విడుదల చేశామని, 259 మంది దళితులకు దళితబంధు కింద రూ.10 లక్షలు అందించామని వివరించారు. 50 మంది దళితులకు రూ.3.76కోట్లు ఖర్చు చేసి 239.37 ఎకరాల వ్యవసాయ భూమి పంపిణీ చేశామని తెలిపారు. రెండో విడతలో రూ.190.82 కోట్లతో 10,904 లబ్ధిదారులకు గొర్రెల యూనిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

విద్య, వైద్యానికి పెద్దపీట

జిల్లాలో రూ.71.37 కోట్లతో 191 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు- మన బడి కింద మౌలికవసతులు కల్పించి ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దామని, ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన చేస్తున్నామన్నారు. రామగుండంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి, 134 రకాల పరీక్షలు చేసే డయాగ్నొస్టిక్ హబ్‌ను రూ.2 కోట్లతో ఏర్పాటు చేశామని, పెద్దపల్లి, రామగుండం ప్రాంతాల్లో డయాలసిస్ సేవలు ప్రారంభించామని వెల్లడించారు.

స్వచ్ఛతలో జాతీయ అవార్డులు

పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో జిల్లాలో గ్రామాలు, పట్టణాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని, పారిశుధ్యం, పచ్చదనం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. దీంతో జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం 14 అవార్డులు అందించిందని గుర్తుచేశారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్

వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం వైద్య, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, విద్యాశాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను విప్, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో డీఐజీ రమేశ్, కలెక్టర్ డాక్టర్ సంగీతసత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ వైభవ్ గైక్వాడ్, పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి డి.హేమంత్‌కుమార్, రామగుండం మేయర్ అనిల్‌కుమార్, ఆర్డీవోలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మచారి, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో పోలీసుల పరేడ్


చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన


వేడుకలకు హాజరైన జిల్లా అధికారులు, స్థానికులు

న్యూస్‌రీల్

తెలంగాణకు విశిష్ట చరిత్ర


పూల మొక్క అందిస్తున్న ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): తెలంగాణ రాష్ట్రానికి విశిష్ట చరిత్ర ఉందని ఎన్టీపీసీ రామగుండం-తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి అంతులేని అభివృద్ధి, అనంతమైన ఆనందాన్ని తీసుకురావడానికి ఎన్టీపీసీ రామగుండం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు ప్రసేన్‌జిత్‌పాల్, మోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్ వేముల, ఠాకూర్, హరేరామ్‌సింగ్, తపస్‌సాహా, ఏజీఎం బిజోయ్‌కుమార్ సిక్దర్, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా, యూనియన్లకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ అభివృద్ధిలో ఆర్‌ఎఫ్‌సీఎల్ కీలకపాత్ర


మాట్లాడుతున్న సీజీఎం సుధీర్‌కుమార్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): వ్యవసాయ రంగ అభివృద్ధిలో ఆర్‌ఎఫ్‌సీఎల్ కీలక పాత్ర పోషిస్తుందని రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ సీజీఎం సుధీర్‌కుమార్ ఝా అన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రానికి కావలసిన యూరియాలో 25శాతం ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం నుంచి సరఫరా చేస్తున్నామని తెలిపారు. 2013లో 3.6 శాతం నుంచి 2023లో 6.8 శాతానికి రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి ఆర్‌ఎఫ్‌సీఎల్ దోహదపడిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

వకీల్‌పల్లిగనిలో ప్రమాదం

- ఇద్దరికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 పరిధి వకీల్‌పల్లిగనిలో సైడ్‌ఫాల్ అయి ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. గనిలోని 7వ లెవల్, 36వ డీప్ కంటిన్యూస్ మైనర్‌లో ఉదయం సైడ్‌గోడ కూలింది. అక్కడ పనిచేస్తున్న యాక్టింగ్ కేబుల్ బాయ్‌లు నగేశ్, నవీన్‌పై పడడంతో గాయాలైనాయి. వారిని హుటాహుటిన గని నుంచి పైకి తరలించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. నగేశ్ నడుము పైభాగంలో బొగ్గుపెళ్లలు పడడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

'గోదావరి హారతి' విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రామగుండం: వేదకాలం నుంచి నదులను పూజించే సంస్కృతిని తిరిగి పునరుద్ధరించడంలో భాగంగా 2012 నుంచి గోదావరినది హారతి పేరుతో ఏటా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గోదావరి హారతి రాష్ట్ర కో కన్వీనర్ క్యాతం వెంకటరమణ తెలిపారు. శుక్రవారం అంతర్గాం గోదావరినది వద్ద పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 6న ఉదయం అంతర్గాం శివారులోని గోదావరినదికి హారతి వేడుకలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై గోదారమ్మ ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో యాత్ర రూట్ ఇన్‌చార్జి లోకనాథ, మల్లారెడ్డి, దేవేందర్, శ్రీనాథ్ తదితరులున్నారు.



'ఫైర్'డే

- ముత్తారం @ 46.4 డిగ్రీలు
- నిప్పుల కొలిమిగా భానుడు

సాక్షి, పెద్దపల్లి: భానుడు నిప్పుల కొలిమిలా మండుతున్నాడు. దీంతో ఈవేసవి సీజన్‌లోనే అత్యధికంగా ముత్తారం మండలంలో శుక్రవారం 46.4డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయింది. ఇది రాష్ట్రంలోనే మూడో అత్యధిక ఉష్ణోగ్రత. ఇల్లు దాటి కాలు బయట పెట్టేందుకు ప్రజలు జంకుతున్నారు. ఒక వైపు మండుతున్న ఎండలు, మరోవైపు వడగాలులు వెరసి జిల్లావాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. క్రమంగా ఎండతీవ్రత పెరుగుతూ, గాలిలో తేమ శాతం గణనీయంగా తగ్గిపోయి ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.

వడగాలుల ప్రభావం

అధిక ఉష్ణోగ్రతలకు తోడు వడగాలులు వీస్తున్నాయి. దీంతో వృద్ధులు, చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారు. ఉదయం 8 గంటలు దాటిందంటే చాలు సుర్రుమంటున్న ఎండ సాయంత్రం 6గంటలు దాటినా తన ప్రభావాన్ని చూపుతోంది. అత్యవసరమైతే తప్ప జనాలు బయటకు రాలేని పరిస్థితి. ఇక మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల వరకు భానుడి ప్రకోపం కారణంగా ఎక్కడచూసినా నిర్మానుష్యంగా కనపడుతోంది.

మోగుతున్న ప్రమాద ఘంటికలు

వాతావరణ శాఖ లెక్కల ప్రకారం ఎండ తీవ్రతల ఆధారంగా ప్రమాదకర స్థాయిని అంచనా వేస్తారు. వేసవిలో 35డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదైతే దానిని సాధారణంగా పరిగణిస్తారు. 35–40డిగ్రీల వరకు మోస్తరు ఉష్ణోగ్రతలుగా, 40–45 డిగ్రీల వరకు ప్రమాదకరంగా భావిస్తారు. ఇక 45 డిగ్రీలు దాటితే దానిని అత్యంత ప్రమాదకరంగా హెచ్చరికలు జారీ చేస్తారు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుంటే మంచిది. బయటకు వెళ్లినా తగిన రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

జిల్లాలో శుక్రవారం అత్యధికంగా నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)
ముత్తారం	46.4
ఓదెల	44.9
రంగంపల్లి	44.7
కమాన్‌పూర్, మల్యాలపల్లి	44.6
సుగ్లాంపల్లి, పాలితం, భోజన్నపేట, శ్రీరాంపూర్	44.4
ఈసాలతక్కలపల్లి, అకినేపల్లి, ధర్మారం	44.3
కల్వచెర్ల	44.1
కూనారాం	43.8

'ఇష్టానుసారంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు'

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి– కూనారం రోడ్డులో రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనులను ఇష్టానుసారంగా చేపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దపల్లిలో ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, మాజీ ఎంపీపీలు సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, నాయకులు హాజీ, రవుఫ్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిబంధనలను తుంగలో తొక్కి వంతెనల నిర్మాణ పనులు ఇష్టానుసారంగా చేపడుతున్నారని, వాటిపై తాను పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తానన్నారు. అలాగే పదేండ్ల పాలన పూర్తికాకున్న దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎంపీపీ సత్యనారాయణరెడ్డి అన్నారు. పోరాడి సాధించిన తెలంగాణలో ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని సీఎం సంపూర్ణంగా అమలు చేయలేదని విమర్శించారు.

జెండా ఆవిష్కరణలో అపశ్రుతి


తలకిందులైన జాతీయ జెండా

పెద్దపల్లిరూరల్: తెలంగాణ అవతరణ వేడుకల్లో భాగంగా శుక్రవారం పెద్దపల్లి మండలపరిషత్ కార్యాలయం ఎదుట ఆవిష్కరించిన జాతీయ పతాకం తలకిందులైంది. ఎంపీపీ స్రవంతి జాతీయజెండాను ఆవిష్కరించారు. అయితే జెండా తలకిందులుగా ఎగిరిందని వెంటనే గ్రహించిన అధికారులు జెండాను కిందికి దించి సవరించి మళ్లీ ఎగురవేశారు.

'తెలంగాణలో ప్రజల బతుకులు మారలె'


మాట్లాడుతున్న చలపతిరావు

గోదావరిఖని(రామగుండం): కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల బతుకులు ఏమాత్రం మారలేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జేవీ చలపతిరావు అన్నారు. శుక్రవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన నిరసన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలు కష్టాల్లో ఉంటే ఏం సాధించారని కేసీఆర్ ప్రభుత్వం సంబరాలు జరుపుతుందని ప్రశ్నించారు. గత పాలకుల విధానాలనే నేటి పాలకులు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. తెలంగాణ కోసం త్యాగాలు, పోరాటాలు, బలిదానాలు చేసిన కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని, కేసీఆర్ కుటుంబం మాత్రం విలాసవంతమైన జీవితాలు గడుపుతోందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమావేశంలో కె.రాజన్న, ఐ.కృష్ణ, ఎ.వెంకన్న, బి.అశోక్, చిలుక శంకర్, ఎం.దుర్గయ్య, కె.జ్యోతి, డి.బుచ్చమ్మ, కె.మల్లేశం, మేరుగు చంద్రయ్య, పైడిపెల్లి రమేష్ పాల్గొన్నారు.

నేడు రైతు దినోత్సవం

పెద్దపల్లిరూరల్: రాష్ట్రావతరణ వేడుకల్లో భాగంగా శనివారం జిల్లాలో రైతు దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంగీత వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఎలిగేడు మండలం ధూళికట్ట వద్ద రైతువేదికలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొంటారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి, పాలితం, సుల్తానాబాద్ మండలం సుద్దాల రైతువేదికలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కమాన్‌పూర్ మండలం గుండారం రైతువేదిక వద్ద జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, పాలకుర్తి రైతువేదిక, అంతర్గాం మండలం సోమన్‌పల్లి వద్ద రామగుండం ఎమ్మెల్యే చందర్ వేడుకల్లో పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు. డప్పుచప్పుళ్లతో రైతులను సాదరంగా ఆహ్వానించాలని, రైతులందరికీ నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

ప్రజాప్రతినిధుల నిర్బంధం


మార్కెట్‌యార్డు గేటుకు తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

మంథని: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంథని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు వచ్చిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను రైతులు నిర్బంధించారు. మార్కెట్‌లో జెండా ఆవిష్కరణ చేస్తున్న సమయంలో రైతులు యార్డు గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. దీంతో ప్రజాప్రతినిధులు యార్డులోనే ఉండిపోయారు. ధాన్యం తూకం వేయడం లేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన మాట నిలుపుకోవడం లేదని, రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి కలుగజేసుకొని త్వరగా తూకం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

క్లుప్తంగా

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు'



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని పేర్కొంటూ శుక్రవారం అమరవీరుల స్తూపం వద్ద దీక్షాదివస్‌తో నిరసన చేపట్టారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తావరకు ర్యాలీ తీశారు. ప్రత్యేక తెలంగాణలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అనేక హామీలు నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్, నాయకులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్, అడేపు శంకర్, కోడిపుంజుల లక్ష్మి, మార్త రాములు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం పర్యటన రద్దు

రామగుండం: రైల్వేస్టేషన్‌లో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ ఏకె.గుప్తా పర్యటన షెడ్యూల్ ఖరారైనా పలు సాంకేతిక కారణాలతో అప్పటికప్పుడు రద్దయినట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌ఎం కాగజ్‌నగర్ నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక రైలులో రామగుండం చేరుకున్నా కొన్ని కారణాలతో రైలు దిగకుండానే ఉన్నతాధికారులతో మాట్లాడి వెళ్లిపోయారు. కాగా డీఆర్‌ఎం పర్యటనకు వారం రోజులుగా రైల్వే ఉన్నతాధికారులు ఏర్పాట్లుచేసినా, రద్దుకావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాల గ్రామశివారులోని పంట పొలాలకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు దావనంలా వ్యాపించి గ్రామ సమీపానికి చేరడంతో సర్పంచ్ లావణ్య విషయం తెలుసుకుని ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్‌ఇంజిన్ ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో పోలీస్ అధికారులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా 1500 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శాంతినగర్ ఆలయం సమీపంలో శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి పోలీసులను గమనించిన పారిపోతుండగా ఎస్సై మహేందర్, సిబ్బంది అతడిని పట్టుకుని విచారించారు.
మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీ పరిధిలోని జాన్సీనగర్‌కు చెందిన శివసాయి మహారాష్ట్రలోని బల్లార్‌పూర్ నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి పెద్దపల్లిలో ఎక్కువ ధరకు అమ్ముకోవాలని వచ్చినట్లు తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకుని శివసాయిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాసర ట్రిపుల్‌ఐటీ పిలుస్తోంది

- 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 19 వరకు గడువు
- 26న తొలి జాబితా విడుదల
- పదోతరగతి పూర్తయిన విద్యార్థులకు సువర్ణావకాశం



బాసర ట్రిపుల్‌ఐటీ ముఖద్వారం

కరీంనగర్/కోనరావుపేట(వేములవాడ): పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ)లో బీటెక్ చదువుకోవడానికి అవకాశం ఉంది. ఈ మేరకు మే 31న నోటిఫికేషన్ జారీ అయింది. చాలా మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు దరఖాస్తు చేయడం తెలియక ఆందోళన చెందుతుంటారు. కొన్నిసార్లు పొరపాట్లతో సీటు చేజార్చుకుంటారు. ఈ నేపథ్యంలో దరఖాస్తు విధానం, తేదీలు తదితర వివరాలపై కథనం.

రెగ్యులర్ విద్యార్థులకే..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ డిగ్రీ 2023–24 విద్యాసంవత్సరానికిగాను 1500 సీట్లతోపాటు ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 150 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. ఎస్సెస్సీ లేదా తత్సమాన పరీక్ష 2023లో రెగ్యులర్ విద్యార్థులు ప్రథమ ప్రయత్నంలోనే ఉత్తీర్ణులై ఉండాలి. 31–12–2023 నాటికి వయసు 18 ఏళ్లకు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 21 సంవత్సరాలుగా నిర్ణయించారు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

పదోతరగతిలో సాధించిన జీపీఏ (గ్రేడ్ పాయింట్ యావరేజ్), ప్రతీ సబ్జెక్ట్‌లో అభ్యర్థి పొందిన గ్రేడ్ ప్రతిభ ఆధారంగా రిజర్వేషన్లకు లోబడి ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాలు, ఆర్జీయూకేటీ నిబంధనలను అనుసరించి ప్రవేశాల కోసం నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఆదర్శ పాఠశాలల్లో చదివినవారి జీపీఏకు 0.4 పాయింట్లు కలుపుతారు. రాష్ట్రపతి, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మొత్తం సీట్లలో 85 శాతం తెలంగాణ విద్యార్థులకు, మిగతా 15 శాతం అన్‌రిజర్వుడ్ సీట్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు. ఈ రెండు రాష్ట్రాల విద్యార్థులే కాకుండా ఇతర రాష్ట్రాల వారికి గ్లోబల్ కేటగిరీ కింద 5 శాతం సీట్లు రిజర్వ్‌గా, గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న భారతీయుల పిల్లలకు 2 శాతం సీట్లు ఉంటాయి. రాష్ట్రపతి ఉత్తర్వులు ఆర్టికల్ 371–డి, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లకు లోబడి అన్ని రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ఎంపిక ప్రక్రియ చేపడుతారు.

దరఖాస్తు చేసుకునే విధానం..

ఈ–సేవ, టీఎస్ ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు ఫీజు రూ.500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 450 చెల్లించాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాల, గ్లోబల్ అభ్యర్థులకు రూ.1,500, ఎన్నారై ఇంటర్నేషనల్ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు చెల్లించాలి. ఒకటి కంటే ఎక్కువ సార్లు దరఖాస్తు చేసుకుంటే చివరగా చేసిన దరఖాస్తును పరిగణలోకి తీసుకుంటారు. హార్డ్ కాపీలను ఈ కింద చిరునామాకు రిజిష్టర్ పోస్ట్‌లో చేయాలి. 'ద డైరెక్టర్, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, బాసర, నిర్మల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, పిన్. 504107'కు పంపాలి. కవర్‌పైన అప్లికేషన్ ఫర్ అడ్మిషన్ 2023 ఆర్జీయూకేటీ బాసర అని రాయాలి.

ముఖ్యమైన తేదీలు..

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ : 19 జూన్ 2023
ఎంపికైన విద్యార్థుల ప్రకటన : 26 జూన్ 2023
కౌన్సెలింగ్ : 1 జూలై నుంచి
పూర్తి వివరాలకు బాసర ట్రిపుల్‌ఐటీ వెబ్‌సైట్ rgukt.ac.in సందర్శించవచ్చు.

కల్పించే సౌకర్యాలు..

ఎంపికైన ప్రతీ విద్యార్థికి ఆరేళ్లపాటు నాణ్యమైన విద్య, ల్యాప్‌టాప్ ఉచితంగా అందిస్తారు. అలాగే ఉచితంగా యూనిఫామ్స్, ఏడాదికి రెండు జతల షూ, హాస్టల్‌లో అన్ని వసతులు కల్పిస్తారు.

దరఖాస్తుతో వీటిని జత చేయాలి..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించిన తర్వాత ప్రింట్ తీసుకొని, ఆన్‌లైన్ ఫీజు రసీదు, పదో తరగతి హాల్‌టికెట్ జిరాక్స్ కాపీ, పదో తరగతి వరకు విద్యా ధ్రువపత్రాలు, ఆన్‌లైన్‌లో తీసిన పదోతరగతి మార్కుల మెమో, కుల ధ్రువీకరణ పత్రం, రిజర్వుడ్ కేటగిరీ అభ్యర్థులు(దివ్యాంగులు, ఆర్మీ కుటుంబీకులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ తదితరులు) తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లను దరఖాస్తు ఫాంకు జతచేసి, జూన్ 5 నుంచి 19లోగా అందేలా చూసుకోవాలి. ఎంపికైన సమాచారాన్ని అభ్యర్థులకు పోస్ట్, ఎస్‌ఎంఎస్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తారు. కౌన్సెలింగ్ సమయంలో అభ్యర్థులు వ్యక్తిగతంగా ఆర్జీయూకేటీ బాసరలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి. సెమిస్టర్ కలుపుకొని సంవత్సర ఫీజు రూ.37 వేలు ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉన్నవారు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. తెలంగాణకు సంబంధించిన ఎన్నారైల పిల్లలు ఎంపికైతే ఏడాదికి రూ.1.36 లక్షలు, మిగతా ఎన్నారైలు అయితే రూ.3.01 లక్షలు చెల్లించాలి. ప్రవేశ సమయంలో ఆరోగ్యబీమా ఇతరాలకు సంబంధించి రూ.3,500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.3 వేలు చెల్లించాలి.

సీట్లకు తీవ్రమైన పోటీ..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఉన్న 1,500 సీట్లకు తీవ్రమైన పోటీ ఉంటుంది. గతేడాది దాదాపు 33 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఎంపికకు రిజర్వేషన్లు..

ఎస్సీలకు 15, ఎస్టీలకు 10, బీసీ(ఏ)కు 7, బీసీ(బీ)కి 10, బీసీ(సీ)కి 1, బీసీ(డి)కి 7, బీసీ(ఈ)కి 4, ఈడబ్ల్యూఎస్ వారికి 10, దివ్యాంగులకు 3, సైనిక ఉద్యోగుల పిల్లలకు 2, ఎన్‌సీసీకి 1, స్పోర్ట్స్ కోటా వారికి 0.5, బాలికలకు 33.33 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

తాగొచ్చి గొడవ పడుతున్నాడని..

కోరుట్ల రూరల్: తాగొచ్చి ఇంట్లో గొడవపడుతున్నాడని ఓ కుమారుడు తండ్రిని దారుణంగా హత్యచేసిన ఘటన కోరుట్ల మండలం సంగెం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సంగెం గ్రామానికి చెందిన వల్లకొండ చిన్న మల్లయ్య (53)కు భార్య రాజేశ్వరి, కుమారులు పవన్ (23) వంశీ, కూతురు ధరణి ఉన్నారు. పదిహేను ఏళ్లుగా చిన్న మల్లయ్య ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్తొస్తున్నాడు. ఆరునెలల క్రితం వచ్చి గ్రామంలోనే ఉంటున్నాడు. పెద్ద కుమారుడు పవన్ కూడా గల్ఫ్‌కు వెళ్లి 20 రోజుల క్రితం రాగా చిన్న కుమారుడు వంశీ గల్ఫ్‌లో ఉన్నాడు. కూతురు ధరణికి వివాహం కావడంతో అత్తవారింట్లో ఉంటోంది.

సహకరించిన ఇద్దరు

చిన్న మల్లయ్య గల్ఫ్ నుంచి వచ్చిన ప్రతిసారి తాగి రాజేశ్వరితోపాటు కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. దీంతో రాజేశ్వరి, పవన్ చెల్లె ధరణి అత్తవారి ఊరైన మేడిపెల్లి మండలం వల్లంపెల్లిలో ఉంటున్నారు. తరచూ తండ్రి గొడవపడుతున్నాడని కక్ష పెంచుకున్న పవన్ దేశాయిపేటకు చెందిన మేనమామ కొడుకు కార్తీక్, భీమారంకు చెందిన స్నేహితుడు శివతో సంగెంలోని చిన్నమల్లయ్య వద్దకు వెళ్లారు. గోడపైనుంచి దూకి అతనితో గొడవపడ్డాడు. దీంతో కోపోద్రిక్తుడైన పవన్ రోకలితో బండతో కొట్టగా చిన్నమల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందించగా పవన్‌ను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. పవన్‌కు సహకరించిన శివ, కార్తీక్ పారిపోయారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

సంఘటనా స్థలాన్ని మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై సురేశ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. పలువురిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి సోదరుడు వల్లకొండ పెద్ద మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం

- ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాజేందర్

కాల్వశ్రీరాంపూర్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ అన్నారు. జూన్ 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించే మహాసభ విజయవంతం చేయాలని రాజేందర్ కాల్వశ్రీరాంపూర్‌లో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగ ఉపకులాల ఆకాంక్ష అంతిమ లక్ష్యం ఎస్సీల వర్గీకరణ సాధించుకోవడమేనన్నారు. వర్గీకరణ బిల్లు సాధించేవరకు పోరాటం ఉధృతం చేస్తామ న్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పో రాట సమితి రెడ్డి నారాయణరెడ్డి, అంబేడ్కర్ సంఘ ం జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య, నాయకులు పా ల రాజేశం, మంథని రామస్వామి, శంకర్, రామ్మూర్తి, లక్ష్మయ్య, రమేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైద్యకళాశాలలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్

కోల్‌సిటీ: రామగుండం ప్రభుత్వ వైద్యకళాశాలలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో జాతీయ జెండాను, ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ నరేందర్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

షటిల్ ఆడుతూ గుండెపోటుతో మృతి



రాజగంగారాం (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని జగిత్యాల క్లబ్‌లో శుక్రవారం ఉదయం షటిల్ ఆడుతూ బూస వెంకటరాజగంగారాం(53) గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన వెంకటరాజగంగారాం తన స్నేహితులతో కలిసి క్లబ్‌లో షటిల్ ఆడుతున్నాడు. అకస్మాత్తుగా కిందపడిపోవడంతో స్నేహితులు వెంటనే సీపీఆర్ చేశారు. ఆ తర్వాత స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతికి క్లబ్ కార్యదర్శి ముస్కు నారాయణరెడ్డి, సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో మద్దికుంట వాసి..

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మద్దికుంటకు చెందిన సూత్రపు దేవరాజు(36) నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మద్దికుంటకు చెందిన సూత్రపు దేవరాజు నిజామాబాద్ జిల్లా సారంగపూర్‌లో క్లా రవ్వత్తిలో స్థిరపడ్డాడు. దేవరాజు బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దేవరాజు తీవ్రంగా గాయపడగా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. దేవరాజు మృతదేహాన్ని మద్దికుంటకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వడదెబ్బతో కూలీ..

వేములవాడ : పట్టణంలో దినసరి కూలీగా పని చేస్తున్న గోనెల శంకర్ (53) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ రూరల్ మండలం లింగంపల్లికి చెందిన శంకర్ వేములవాడలో కూలీ పనికి వెళ్తున్నాడు. శుక్రవారం కూలీ పనికి వచ్చిన శంకర్ కుప్పకూలి పడిపోయాడు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. రూరల్ సెస్ డైరెక్టర్ దేవరాజం, సర్పంచ్ కవిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఆకుల దేవరాజం తెలిపారు. మృతుడికి భార్య తిరుమల, కూతుళ్లు శ్రావ్య, హర్షిణి ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలి



తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగురవేస్తున్న ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్



జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న జీఎం మనోహర్

- ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమే తెలంగాణ

గోదావరిఖని/కమాన్‌పూర్: బంగారు తెలంగాణ అభివృద్ధిలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్, ఆర్జీ–3ఏజీఎం వెంకటేశ్వర్లు కోరారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయాలు, గనుల వద్ద జెండా ఎగురవేసి కేక్‌కట్ చేశారు. అనంతరం తెలంగాణా తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సెంటనరీకాలనీ రాణి రుద్రమాదేవి క్రీడా మైదానం వద్ద అమరుల స్థూపం, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ఆర్జీ–3 ఏజీఎం వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఉత్పత్తి లక్ష్యసాధనకు ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, ఏరియా సేఫ్టీ అధికారి బచ్చ రవీందర్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, సీఐటీయూసీ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు నరేందర్, అధికారులు రాధాకృష్ణ, ఎలిషా, సీతారాం, బైద్య, రఘుపతి, శ్రీనివాసులు, వెంకటరమణ, బైనుల్లా బద్దిన్, విలాస్ శ్రీనివాస్ పొద్దార్, చంద్రశేఖర్, కర్ణ, పద్మరాజు, ఐలయ్య, లక్ష్మీనారాయణ, గంద్ర దామోదర్‌రావు, రంగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖని: తెలంగాణ రాష్ట్ర అవతణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఫుడ్ కోర్టుస్టాల్స్, ప్రముఖ కళాకారులచే ధూందాం, తెలంగాణ కల్చరల్ షో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జీఎం వెంట ఏరియా ఇంజినీర్ రాంమూర్తి, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



గాయపడిన కార్మికుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

గోదావరిఖని: గనుల్లో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సూచించారు. శుక్రవారం సింగరేణి ఏరియా ఆసుపత్రికి వెళ్లి వకీల్‌పల్లిగని ప్రమాదంలో గాయపడిన కార్మికుడు నవీన్‌ను పరామర్శించారు. నవీన్ ఆరోగ్యపరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు పూర్తిస్థాయిలో రక్షణపై అవగాహన కల్పించాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యంపై ఉందన్నారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, యూనియన్ నాయకులు అయిలి శ్రీనివాస్, గంద్ర దామోదర్‌రావు, పర్లపల్లి రవి యాదవరెడ్డి తదితరులున్నారు.

షిఫ్టువేళలు మార్చాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

గోదావరిఖని: ఆర్జీ–1ఏరియాలోని జీడీకే–1వ గనిలో కార్మికుల షిఫ్టు వేళలు మార్చాలని వినతిపత్రం అందించారు. 9 గంటల షిఫ్టులో పనిచేస్తున్న కార్మికులను 7 గంటల షిఫ్టుకు మార్చాలని కోరుతూ కాలరీ మేనేజర్ రమేశ్‌కు వినతిపత్రం అందించారు. దీంతో రోజువారీ కుటుంబ కార్యక్రమాల్లో పాల్గొనలేకపోతున్నామని వాపోయారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని షిఫ్టు వేళలు మార్చాలని విజ్ఞప్తి చేశారు.

హనుమాన్ ఆలయంలో హుండీ చోరీ



ఆలయాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

జూలపల్లి: మండలకేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలోని హుండీని గురువారం రాత్రి దొంగలు చోరీ చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లోక లింగారెడ్డి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆలయ పూజారి నిరంజన చారి రోజువారి పూజలు ముగించుకుని ఆలయం దర్వాజాలు మూసివేసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం పూజ కోసం వచ్చిచూడగా తలుపులు, హుండీ పగులగొట్టి ఉండడంతో ఆలయ ధర్మకర్తలకు సమాచారం అందించారు. వెంటనే ఆలయకమిటీ అధ్యక్షుడు వచ్చిచూసి చోరీ జరిగినట్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి మూడుగంటలు ఆలస్యంగా వచ్చారని ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్ తెలిపారు. గతంలో పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో మూడు ఆలయాల్లో చోరీ జరిగినా దొంగలను ఇప్పటి వరకు పట్టుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా చోరీకి పాల్పడిన వారిని గుర్తించి పట్టుకోవాలని కోరారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి



శ్రీనివాస్(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామానికి చెందిన ఇల్లందుల శ్రీనివాస్(29) యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరుకు చెందిన ఇల్లందుల రాజయ్యకు ముగ్గురు కుమారులున్నారు. వీరిలో చిన్నకుమారుడు శ్రీనివాస్ ఎంబీఏ పూర్తిచేసి మంచిర్యాల జిల్లా జైపూర్ విద్యుత్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ వర్కర్‌గా రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. నెలరోజులుగా డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. తల్లిదండ్రులు డ్యూటీకి వెళ్లాలని సూచించడంతో నెలరోజుల తర్వాత వెళ్తానని చెప్పాడు. ఈక్రమంలో రెండురోజుల క్రితం చిన్నమ్మ ఇంటికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన శ్రీనివాస్ తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో ఏదైనా పనిమీద వెళ్లి ఉంటాడని తల్లిదండ్రులు భావించారు. శుక్రవారం అల్లూరులోని చెరువులో యువకుడి మృతదేహం నీటిపై తేలిందని గ్రామస్తులకు తెలియడంతో అనుమానంతో శ్రీనివాస్ తల్లిదండ్రులు చెరువు వద్దకు వెళ్లిచూడగా తమ కొడుకు శవమై తేలాడని కన్నీరుమున్నీరుగా విలపించారు. శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడా? మరే ఇతర కారణాలతో మరణించాడా అనేది విచారణలో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి రాజయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై కళాధర్ రెడ్డి తెలిపారు.